## క్లుప్తంగా

### ఎల్‌ఓసీ అందజేత



**మల్హర్:** మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన కటకం వర్షిత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆర్థిక సాయం కోసం కుటుంబ సభ్యులు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.1.30 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆస్పత్రి సహాయకుడు సచిన్ ద్వారా సోమవారం ఎల్‌ఓసీ కుటుంబ సభ్యులకు అందజేశారు.

### శివాలయంలో ప్రత్యేక పూజలు

**గణపురం:** శ్రావణమాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### చర్య తీసుకోవాలి

**మల్హర్:** మండలంలోని పెద్దతూండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సక్రమంగా విధులు నిర్వర్తించని ఇంగ్లిష్ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు 35 మంది పిల్లలు చదువుతున్నారని, 9 మంది సిబ్బంది ఉండగా 8 మంది టీచర్లు పని చేస్తున్నారని తెలిపారు. ఇంగ్లిష్ టీచర్ లాంగ్ లీవ్ పెట్టడంతో ఇంగ్లిష్ సబ్జెక్టు చదువుకు విద్యార్థులు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ఖాళీ చూపక పోవడంతో ఇంగ్లిష్ టీచర్ పోస్టును అధికారులు భర్తీ చేయడం లేదని చెబుతున్నారు.

### పరామర్శ



**గణపురం:** మండలంలోని గాంధీనగర్‌కు చెందిన కీర్త శ్రీకాంత్ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం పరామర్శించారు. అలాగే అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పల్లెబోయిన భద్రయ్యను పరామర్శించి ధైర్యం కల్పించారు. కాంగ్రెస్ నాయకులు కాల్వ రాంరెడ్డి, ముత్యాల రాజయ్య, బొచ్చు స్వామి పాల్గొన్నారు.

### 7న సామాజిక తనిఖీ ప్రజావేదిక

**కాటారం :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 7న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు, ఏపీఓ వెంకన్న సోమవారం తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో 2024, ఏప్రిల్ 1 నుంచి 2025, మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు వారం రోజులుగా తనిఖీ చేపట్టి నివేదికలు రూపొందించినట్లు వారు తెలిపారు. నివేదికలను ప్రజావేదిక ద్వారా వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి

**రేగొండ:** కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రవేశపెట్టిన ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారు ఉన్నత విద్యను అభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ స్కూల్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్‌కు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### మహాసభలను జయప్రదం చేయండి

**బయ్యారం:** ఈనెల 8నుంచి 10 వరకు కోల్‌కతాలో జరగనున్న స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ పిలుపునిచ్చారు. మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాలునాయక్, వెంకన్న, భద్రు నాయక్, సురేష్, ఆర్.వి.ప్రసాదరావు, వెంకన్న పాల్గొన్నారు.

### బోదకాలు నివారణే లక్ష్యం

**గంగారం:** బోదకాలు నివారణ అందరి బాధ్యత అని గంగారం వైద్యాధికారి ప్రత్యూష అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆగస్టు 10 నుంచి 25 వరకు మాస్ డ్రగ్ అడ్మిని స్ట్రేషన్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

# వ్యాధుల కాలం.. జరపైలం



రాంనగర్‌లో వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు (ఫైల్)



దుంపెల్లిగూడెంలో నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది (ఫైల్)

**అప్రమత్తంగా ఉంటేనే ఆరోగ్యం**
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాల ఏర్పాటు

**గోవిందరావుపేట :** వానాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ప్రజలు అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధులు, విషజ్వరాల నుంచి రక్షణ పొందవచ్చు. ఈ సీజన్‌లో ఎక్కువగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉంది. వర్షపు నీరు నిలిచి వాటిలో దోమలు వృద్ధి చెంది రోగాలకు కారణమవుతాయి. సైడ్ కాల్వలు, పాత కూలర్లు, టైర్లలో నిల్వ ఉన్న నీటిలో, నివాస ప్రాంతాల సమీపంలోని ఖాళీ కొబ్బరి బొండాల్లో దోమలు పెరిగే అవకాశం ఉంది.

**అవగాహనతో వ్యాధులు దూరం..**

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు. మూడేళ్ల నుంచి వానాకాలం సీజన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారిన పడ్డారు. ఈ సీజన్‌లో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే కొంత వరకైనా ప్రజలు అప్రమత్తంగా ఉంటారు.



చల్వాయిలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

**అపరిశుభ్రతతో ఇబ్బందులు..**

ప్రతి వర్షాకాల సీజన్ ప్రారంభంలో అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించి పారిశుద్ధ్య పనులపై హడావుడి చేయడమే తప్ప గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నివారణకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి అపరిశుభ్రత తాండవిస్తోంది. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు పూర్తిస్థాయిల్లో పనులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**
- సైడ్ కాల్వల్లో చెత్తను తొలగించి మురుగు నీరు నిల్వకుండా చూడాలి.
- కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఇంటి ఆవరణలో కొబ్బరి బొండాలు, పాత టైర్లు, కూలర్లలో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలి.
- దోమల నివారణకు మందును పిచికారీ చేయించాలి.
- అంటువ్యాధుల బారిన పడకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సూచనలను పాటించాలి
- రోజు వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి. నిల్వ ఉన్నవాటిని తినకూడదు. – సాధ్యమైనంత వరకు కాచి చల్లార్చిన నీటినే తాగాలి. పాత్రలపై ఎల్లప్పుడూ మూతలు ఉండేలా చూసుకోవాలి.
- జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లునొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో సంప్రదించాలి.

**పారిశుద్ధ్య పనులు చేపట్టాలి**



వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. డ్రెయినేజీల్లో మురుగు నీరు నిలవడంతో దోమలు పెరుగుతున్నాయి. మురుగునీటి నిల్వలపై బ్లీచింగ్ పౌడర్ చల్లి ఫాగింగ్ చేయాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– తాటి శ్రీను, చల్వాయి

**అవగాహన కల్పించాలి**



సీజనల్ వ్యాధులు, పరిసరాల శుభ్రతపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తే సీజనల్ వ్యాధుల బారినుంచి ప్రజలను రక్షించవచ్చు. గ్రామస్తులు సైతం పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి.

– చంద్రకాంత్, మండల వైద్యాధికారి

## ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవాలి

**ఏటూరునాగారం :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9వ తేదీన గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి పోడెం బాబు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో తుడుందెబ్బ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కులు, చట్టాల రక్షణకోసం పోరాటం చేయాలని కోరారు. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. ఆదివాసీల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన జీఓలను మార్చడానికి కుట్రలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.



ఏటూరునాగారం: సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

**వాజేడు :** ఆదివాసీ దినోత్సవాన్ని ఈనెల 9వ తేదీన ఘనంగా నిర్వహించాలని తుడుందెబ్బ మండల ఉపాధ్యక్షుడు చాప లక్ష్మణ్, మండల కార్యదర్శి తొర్రెం సంతోష్ కోరారు. మండల పరిధిలోని కోయవీరాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆదివాసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అన్ని ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రతీ గ్రామంలో ఆదివాసీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

## వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

**వాజేడు :** మండల పరిధిలోని టేకులగూడెం గ్రామ సమీపంలో గల 163 నంబర్ జాతీయ రహదారిపై పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాలు ముగిసిన క్రమంలో ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు రాకపోకలు సాగిస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా సోదాలు చేశారు. వాహనాల్లో తరలిస్తున్న వస్తువులని నిశితంగా పరిశీలించి, ప్రయాణికుల వివరాలను సేకరించారు. అనుమానితులు, కొత్త వ్యక్తుల కదలిక పై ఆరా తీశారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ శిరీష, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది

**ములుగురూరల్ :** తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ములుగు సీడీపీఓ శిరీష పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని బండారుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను తెలిపారు. పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని, అనంతరం తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలని అన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. వ్యక్తిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమరున్నిసా బేగం, గర్భిణులు, బాలింతలు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుక్క దాడిలో రైతుకు గాయాలు

**వాజేడు :** రైతుపై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చిన సంఘటన మండల పరిధిలోని జగన్నాథపురంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుగందపు జ్యోతి ప్రసాద్ మిరుప తోట సాగుకు మిర్చినారు పోస్తున్నాడు. అదే సమయంలో వెనకాల వచ్చిన ఓ పిచ్చికుక్క ఎడమ కాలిపై కరిచింది. అతడిని వాజేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

**ఎస్ఎస్‌తాడ్వాయి :** మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన ఓ పత్రిక విలేకరి తమ్మల సమ్మయ్య (50) సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం సమ్మయ్యకు చాతిలో నొప్పిరావడంతో వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. మృతుడికి భార్య భాగ్యమ్మ, కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె మమత తండ్రికి తలకొరివి పెట్టారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి, డీపీఆర్ఓ రఫీక్, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్ బాబు, పస్రా సీఐ దయాకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, పూజారులు సిద్దబోయిన స్వామి, అనిల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



తండ్రి అంత్యక్రియల్లో కుండపట్టిన కూతురు మమత

## మద్యం షాపులో చోరీ

**ములుగు రూరల్ :** జిల్లా కేంద్రంలోని మద్యం షాపులో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి నగదు ఎత్తుకెళ్లారు. జాతీయ రహదారిని పక్కనే ఉన్న రెడ్డి వైన్స్‌లో పని చేస్తున్న సిబ్బంది ఆదివారం రాత్రి యథావిధిగా షాపును బంద్ చేసి వెళ్లిపోయారు. సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు షాపులోకి చొరబడి రూ.60వేల నగదును దోచుకు వెళ్లినట్లు తెలిసింది. దొంగతనం విషయంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## ఫారెస్టు చెక్ పోస్టును ఎత్తివేయాలి

**ములుగు రూరల్ :** పస్రా–ఏటూరునాగారం జాతీయ రహదారిపై అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ కోరారు. సోమవారం అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీశాఖ చెక్ పోస్టు వద్ద వాహనదారుల నుంచి రూ.100 నుంచి రూ.200లు వసూలు చేస్తున్నారని తెలిపారు. టోల్ పేరుతో పేద, మధ్యతరగతి వాహనదారులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. వెంకటాపురం(కె) మండల కేంద్రం నుంచి యాకన్నగూడెం వరకు ఇసుక లారీల కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, రత్నం రాజేందర్, గఫూర్‌పాషా, ప్రవీణ్, కొర్ర రాజు, రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

## జీపీ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

**వెంకటాపురం(కె) :** విద్యుత్ షాక్‌తో ఇటీవల మృతిచెందిన బీసీ మర్రిగూడెం పంచాయతీ కార్మికుడు విజయ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ కోరారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను వారి నివాసం శాంతినగర్ గ్రామంలో ఆయన పరామర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ కార్మికుడు విజయ్ కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుడు చనిపోతే ప్రభుత్వ అధికారులు బాధిత కుటుంబాన్ని పరామర్శించక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ కార్మికుల రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు రంజిత్ కుమార్, తాటి శ్రీనివాస్, రాగం సంతోష్, మధుబాబు, శాంతమూర్తి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాజేందర్

## రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి



మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

**వెంకటాపురం(కె) :** మండల పరిధిలోని యాకన్నగూడెం గ్రామం నుంచి వెంకటాపురం మండల కేంద్రం వరకు మరమ్మతుకు గురైన రోడ్ల నిర్మాణ పనులకు రూ.వంద కోట్ల నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పు రఘుపతి డిమాండ్ చేశారు. ఇసుక లారీలతో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఇసుక లారీ వల్ల మండల కేంద్రంలోని రోడ్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. రాళ్లవాగు, బ్రిడ్జితో పాటు కుక్కతోగు వాగు సైతం కూలీపోయే దశకు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఈ నెల 6న తేదీన తలపెట్టిన మండల బంద్‌ను విజయవంతం చేయాలని వారు కోరారు. నాయకులు చిట్టెం ఆదినారాయణ, కుమ్మరి శ్రీను, గ్యానం వాసు, మానిక్యం, దేవి, నిర్మల, రమణయ్య తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు మందులు అందజేస్తున్న వైద్యులు

**మంగపేట :** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్‌కుమార్, అఖిల ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ముత్తమ్మ, ఏఎన్ఎం జయమ్మ, నాగలక్ష్మి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న స్థానికులు, డాక్టర్లు

**మల్లూరులో టీబీ ముక్త్‌భారత్**

మంగపేట మండలంలోని మల్లూరు కేసీఆర్ కాలనీలో గల ఆరోగ్య ఉపకేంద్రంలో చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో వంద రోజుల టీబీ ముక్త్‌భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారం రోజులకు మించి దగ్గు, తెమడ, దమ్ము, జ్వరంతో బాధపడుతున్న క్షయ లక్షణాలు కలిగిన 40 మందికి పరీక్షలు చేశారు. ఎక్స్‌రేకు ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సీతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందని వేతనాలు

- 'మోడల్' ఉద్యోగులకు అందని జీతాలు
- పట్టించుకోని అధికారులు

**మల్హర్:** ఆరు నెలలుగా వేతనాలు అందక మోడల్ స్కూల్‌ని ఔట్‌సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని జీతాలు సమయానికి రాకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం ఆరు మోడల్ స్కూళ్లు ఉండగా 24 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, 50 మంది గెస్ట్ ఫ్యాకల్టీస్ ఉన్నారు. ఒక్కక్కరికీ సుమారు నెలకు రూ.15వేల పైచిలుకు వేతనం చెల్లిస్తోంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా, గెస్ట్ ఫ్యాకల్టీస్‌కు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. ఈ వేతనం సమయానికి అందక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. తమ సమస్యను అధికారులు పట్టించుకోవం లేదని వాపోతున్నా అధికారులు పెండింగ్ వేతనాలు చెల్లించి తమ సమస్య పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు. రు. ఈ మేరకు ఆదివారం మల్హర్ మండలంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావుకు ఆ స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు.



వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు(ఫైల్)

**అప్పులు చేస్తున్నాం..**



ఆరు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ, ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

– రాజబాబు, ఫిజికల్ డైరెక్టర్

**జీతాలు ఇవ్వాలి**

మాకు ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు. ఎప్పుడు అడిగిన వస్తుంది.. ఇస్తాం అంటున్నారు కానీ ఇవ్వడం లేదు. ఒక నెల రాకుంటే ఎలాగో గడుపుతాం. అధికారులు వెంటనే జీతాలు మంజూరు చేయాలి.

– చంద్రయ్య, అటెండర్, మల్హర్

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



**భూపాలపల్లి రూరల్:** ప్రతీ వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. భూపాలపల్లి మండల ఫొటోగ్రాఫర్ సంఘం అధ్యక్షుడు కారుకూరి సతీశ్ ఆధ్వర్యంలో సోమవా రం జిల్లా కేంద్రంలోని జయశంకర్ విగ్రహం వద్ద ఫొటోగ్రాఫర్లకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై శ్రీని వాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ఫొటో గ్రాఫర్లకు వివరించారు. అనంతరం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్ల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రఫీ, గోపరాజు, రంగు రవి, దిండి సత్యం, కోరే సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.